క్లుప్తంగా

19న అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

అర్వపల్లి : తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు ఈనెల 19న సూర్యాపేట డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ డి.సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న పౌర్ణమిని పురస్కరించుకొని ఈ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు, గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులు బుకింగ్ కోసం 73828 36177, 99516 13278లను సంప్రదించాలని కోరారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు



రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్

నూతనకల్ : మండల పరిధిలోని వెంకెపల్లి రేషన్‌దుకాణాన్ని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలో ఉండాల్సిన బియ్యానికి అదనంగా 3క్వింటాళ్ల 94కేజీలు ఉండటంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఉన్నారు.

పచ్చదనానికి అధిక ప్రాధాన్యం



మొక్కలు నాటే స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీలో పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు కోరారు. బుధవారం మున్సిపాలిటీలోని 9వ వార్డులో మొక్కలు నాటే స్థలాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. మొక్కలు నాటడానికి గుంతలు తీయించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, అఖిల, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం



చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు, కార్యదర్శి

అర్వపల్లి : మండల పరిధిలోని కోమటిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉల్లెందుల సైదులు, ఉపాధ్యాయురాలు రామసాని సృజన, పంచాయతీ కార్యదర్శి ఫర్హానా, అంగన్‌వాడీ టీచర్ తొడుసు శివరంజని, ఆయా పద్మ, చైతన్య, మహాలక్ష్మి, కేతమ్మ, జ్యోతి, మౌనిక, మోనిత తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చివ్వెంల : సూర్యాపేట పట్టణానికి చెందిన ఉప్పల సంపత్‌కుమార్ భార్య ఉప్పల అనురాధ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం పట్టణంలోని నిర్వహించిన ఆమె దశదిన కర్మలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, పలువురు పాల్గొని మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, ఎండీ అబీబ్, చలమల్ల నర్సింహ, పల్సా మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల కేంద్రానికి చెందిన బోనగిరి గౌరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కడియం పరమేశ్వర్ మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మొల్కపురి రాంబాబు, గ్రామస్తులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

మద్దిరాల : మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన అంజపెల్లి వెంకటమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పులిగిల్ల లింగయ్యయాదవ్ మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట గ్రామ మాజీ సర్పంచ్ కన్న వెంకటయ్య, వర్రె లింగయ్య, కన్న మల్లయ్య, మహేష్, వీరస్వామి పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సన్నద్ధం

- 29గ్రామాల్లో 29నర్సరీలు, బృహత్ పల్లెప్రకృతి వనం ఏర్పాటు
- ప్రతి నర్సరీల్లో 8వేల మొక్కల చొప్పున పెంపకం
- ఈఏడాది 2.34లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం



సింగారెడ్డిపాలెంలో మొక్కలు పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి రాములు



మాచారంలో మొక్కలు నాటుతున్న కూలీలు

పెన్‌పహాడ్ : రాష్ట్రంలో పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. 2015 నుంచి హరితహారం పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం వన మహోత్సవంగా నిర్వహించాలని సంకల్పించింది. ఈ ఏడాది మండలంలో వివిధ గ్రామాల వారీగా మొక్కలను నాటాలని నిర్దేశించారు. మండలంలోని 29గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల వారీగా హరిత హారం కార్యక్రమాలను అధికారులు ప్రారంభించారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు పక్కా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంచే విధంగా అధికారులు పల్లెల్లో నర్సరీలను ఏర్పాటు చేసి వాటిలో పెరిగిన మొక్కలను నాటేందుకు అధికారులు స్థలాలను గుర్తించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మండల వ్యాప్తంగా..

పదో విడత వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా 29 గ్రామాల్లో 29నర్సరీలు, బృహత్‌పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రతి నర్సరీల్లో 8వేల మొక్కల చొప్పున మండలంలో 2.34లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా సుమారు 16రకాల మొక్కలను పెంచారు. ఉపాధి హామీ పథకం ద్వారా నియమించిన వన సంరక్షకుల ద్వారా నర్సరీల్లో మొక్కల పెంపకం, సంరక్షణ చర్యలు చేపట్టారు. ఆయా నర్సరీలను ఉపాధిహామీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ మొక్కలు పెంచారు. ప్రతి నర్సరీల్లో కానుగ, గుల్మొరా, మునగ, సీమ తంగెడు, ఖర్జూజ, ధానిమ్మ, మందారం తదితర మొక్కలను పెంచారు. వన మహోత్సవంలో పండ్లు, పూల మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

పచ్చదనం పరుచుకునేలా..

నర్సరీల్లో పెంచిన ప్రతి మొక్కను నాటి పల్లెల్లో పచ్చదనం పర్చుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో ప్రభుత్వ స్థలాల్లో, కాల్వలు, చెరువు కట్టలు, రోడ్ల వెంట, నూతనంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నాటిన ప్రతి మొక్కనూ బతికించుకునేందుకు గ్రామస్తుల సహకారం ఉండేలా అధికారులు అవగాహన కల్పించారు. మొక్కలు చనిపోతే గ్రామస్తులు వెంటనే మండల అధికారులకు తెలియజేసి వాటి స్థానంలో మరో మొక్కను నాటేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

యువత చైతన్యం కావాలి

పల్లెల్లో నాటిన ప్రతి మొక్క బతికేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజాధనం దుర్వినియోగం చేయకూడదు. వనమహోత్సవ కార్యక్రమం గురించి ప్రజలకు, గ్రామీణులకు సమగ్రంగా అవగాహన కల్పించాలి. అందుకు గ్రామాల్లో యువత చైతన్యం కావాలి. మొక్కలు విరివిగా నాటాలి.

– నాగరాజు, అనంతారం

విద్యుత్ తీగల కింద నాటొద్దు

మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్ల వెంట ఉన్న విద్యుత్ తీగల కింద మొక్కలను నాటకూడదు. ముందస్తుగా మొక్కలను నాటకుండా ఉంటే బాగుంటుంది. నాటిన మొక్కలు బతికేలా చర్యలు తీసుకొని మొక్కలను నరికివేయకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– సైదులు, పెన్‌పహాడ్

ప్రతి మొక్క బతికేలా చూస్తాం



ఆయా గ్రామాల్లో రోడ్ల వెంట, పొలాల గట్ల వెంట మొక్కలు నాటుతున్నారు. మొక్కల పెంపకానికి గ్రామస్తుల సహకరించాలి. ప్రతి గ్రామంలో 4వేల మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నాం. నాటిన ప్రతి మొక్క బతికేలా అన్ని రకాలచర్యలుతీసుకుంటున్నాం.

– రవి, ఏపీఓ

భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవ్

నూతనకల్ : భూ సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు.. భూమి నమోదు, వివిధ సవరణల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వాటిని పరిష్కరించాలని, అదే విధంగా మీసేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులను కాలయాపన కాకుండా తక్షణమే పరిష్కారమార్గం చూపాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన కార్డుదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాలను తెరిచి బియ్యం పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, నాయబ్ తహసీల్దార్ శ్రీధర్‌నాయక్, ఆర్ఐ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పెండింగ్ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధార శ్రీనివాస్

నాగారం : అమ్మ ఆదర్శ పాఠశాలల్లోని పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ధార శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నిర్దేశించిన పనులను పాఠశాలల హెచ్ఎంలు, పాఠశాల కమిటీల చైర్‌పర్సన్‌ల ద్వారా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం బదిలీల్లో భాగంగా పాఠశాలలకు కొత్తగా వచ్చిన ప్రధానోపాధ్యాయులకు అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంఈఓ బి.బాలునాయక్, ఎఫ్ఎల్ఎన్ ప్రభాకర్, సూపరింటెండెంట్ ముత్తయ్య, అమ్మ ఆదర్శ పాఠశాలల హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీని వాయిదా వేయాలి

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీని తక్షణమే వాయిదా వేయాలని బీఆర్ఎస్ నాయకుడు మట్టిపల్లి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరుస పోటీ పరీక్షల నేపథ్యంలో ప్రిపరేషన్‌కు తగిన సమయం ఇవ్వకుండా నిర్వహించడం సరికాదన్నారు. వరుస పోటీ పరీక్షలు ఉన్నందున అభ్యర్థులు మానసిక వత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరితో పంతానికి పోకుండా అభ్యర్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



పెన్‌పహాడ్ : తహసీల్దార్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



భానుపురి (సూర్యాపేట) : సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆత్మకూర్(ఎస్) : గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని, స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ యాతాకుల వెంకన్న ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం 'కార్మికుల కోర్కెల దినం' సందర్భంగా తహసీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించడం భారంగా మారిందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు మార్కెట్ ధరల ప్రకారం గుడ్ల బిల్లులు చెల్లించాలని, వంటగ్యాస్ ప్రభుత్వమే సప్లయ్ చేయాలని, బకాయి డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల మండల నాయకులు వీరన్న, మారపాక ముత్తయ్య, నవిలే వెంకన్న, బొప్పని కనకమ్మ, ములకలపల్లి రాములు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ అన్నారు. బుధవారం డిమాండ్స్ డే సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 51ను రద్దు చేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, కార్మికులు మృతి చెందితే రూ.20లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని, అదేవిధంగా కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మహేందర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ధనియాకుల శ్రీనివాస్, నకిరేకంటి నర్సయ్య, వెంకటేశ్వర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

భానుపురి (సూర్యాపేట) : ఆశవర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలో ఏఐటీయూసీ అనుబంధ సంస్థ ఆశవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో తమ కుటుంబ భారం మోస్తున్న ఆశవర్కర్ల పనిభారాన్ని తగ్గించాలన్నారు. ఎన్‌హెచ్ స్కీం కింద వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం నెలకు రూ.26వేలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఎన్.కవిత, పి.అరుణకుమారి, టి.గోవర్ధన్, పి.రాధ, ఈ.సైదమ్మ, బి.హుస్సేన్, బి.ఉమా, స్వర్ణలత, జ్యోతి, ఏఐటీయూసీ ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు కృష్ణ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కార్మికులకు ఉరితాడుగా మారిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ×కోర్కెల దినం్డసందర్భంగా బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులను నట్టేట ముంచిందన్నారు. మోటారు వాహన చట్ట సవరణ బిల్లు 2019 తీసుకువచ్చి బడా కార్పొరేట్లకు ప్రభుత్వ రంగ సంస్థలను అప్పజెప్పి ప్రైవేటీకరణ వైపు ప్రయణిస్తుందన్నారు. కార్యక్రమంలో రీజియన్ సహాయ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, డిపో కార్యదర్శి ఉప్పు లక్ష్మయ్య, కోశాధికారి శ్రీకంఠం, కేవీరెడ్డి, ఎల్లయ్య, సైదులు, దామోదర్, ఎలేంద్ర, కృష్ణ, పీవీ స్వామి, పిచ్చయ్య, శ్రీను, సతీష్, రవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



భానుపురి (సూర్యాపేట) : ఆర్టీసీ బస్సు డిపో ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు



ఆత్మకూర్(ఎస్) : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన వన అధికారిని స్రవంతి

తిరుమలగిరి (తుంగతుర్తి) : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని తుంగతుర్తి డివిజన్ ప్రాంతీయ ఉద్యాన వన అధికారిని వి.స్రవంతి కోరారు. బుధవారం మండలంలోని తొండ గ్రామంలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తుంగతుర్తి డివిజన్‌లో మార్చి నెల వరకు 1560 ఎకరాలలో ఆయిల్‌పామ్ తోటలు సాగవుతున్నాయని తెలిపారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలన్నారు. ఈ పంటలకు కూలీల ఖర్చు తక్కువ అని, కోతుల బెడద లేదన్నారు. ఆయిల్‌పామ్ పంటలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ప్రభుత్వం నియమించిన కంపెనీ వారే విక్రయిస్తారని వెల్లడించారు. ఆమె వెంట పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ జూనియర్ మేనేజర్ శశికుమార్, క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, కంపెనీ ప్రతినిధులు నర్సింహ, అనిల్, అఖిల్, మోహన్, రైతులు బుడిగ మనోవికాస్ తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



అర్వపల్లి : ఉపాధ్యాయులను సన్మానించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మండలంలోని పాతర్లపహాడ్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాతర్లపహాడ్ పాఠశాలలోని విద్యార్థులకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు చంచల రుక్మిణి 100భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు. అదే విధంగా బదిలీపై వచ్చిన రామచంద్రయ్య, రమేష్, శ్రీదేవిలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంలు శ్రావణ్‌కుమార్, వెంకటయ్య, ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్, అన్నపూర్ణాచారి, దుర్గా ప్రసాద్‌రెడ్డి, మల్లారెడ్డి, శిరీష, మల్లేశ్వరి, యాదమ్మ, రఘు, శ్రీహరి, రామచందర్, శ్రీశైలం, బ్రహ్మచారి, అనిత తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులకు..

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల పదోన్నతిపై వెళ్లిన, పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు బుధవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ మేకల సునీతరాంబాబు, పాఠశాల హెచ్ఎం ఎం.విజయలక్ష్మి, వి.మధుకర్, పీడీ మల్లేష్, విమల, పుష్పవతి, ప్రసన్నకుమారి, సీహెచ్.శ్రీరాములు, వీరన్న, నాగయ్య, శోభారాణి, రమేష్‌కుమార్, సునంద, అంజలి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని పసునూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రేపాకుల రాంబాబు, రెడ్డబోయిన సైదులు, పాలవెల్లి ప్రేమయ్య, సురేందర్‌రావు, వెంకట్‌రెడ్డి, బాలకిషన్, రమాదేవిని బుధవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం విష్ణుమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థి జీవితాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు గణనీయమన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవాలని, ఎక్కడికి వెళ్లినా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు తొడుసు లింగయ్య, ఏగూరి మంజుల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్) : బదిలీపై వెళ్తున్న వారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



నాగారం : ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థులు

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

మద్దిరాల : మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కావొద్దని, ఎవరైనా గంజాయి అమ్మినట్లు కాని కొన్నట్లు తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గానీ 100 నంబర్‌గాని డయల్ చేసి సమాచారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవి, సీఐ శ్రీనివాస్‌నాయక్, ఎస్ఐ మధునాయుడు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అలసత్వం వహించడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌వర్మ

సూర్యాపేట టౌన్ : మండల పరిధిలోని బాలెంల ఎస్సీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యల పట్ల అధికారులు అలసత్వం వహించడం సరైంది కాదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదిరోజులకు పైగా కళాశాలలో జరుగుతున్న అక్రమాలపై, ప్రిన్సిపల్ అరాచకాలపై ఎన్నోసార్లు నిరసనకు దిగినా ఇంత వరకు సమస్యలను పరిష్కారం చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ప్రిన్సిపాల్ మద్యం తాగుతూ విద్యార్థినులను అసభ్య పదజాలంతో దూషిస్తుందని, వారి తల్లిదండ్రులను అవమానపరిచేలా మాట్లాడుతుందని విద్యార్థినులు చెబుతున్నారని అన్నారు. ప్రిన్సిపల్ కుమారుడు కళాశాలలో రాత్రి సమయంలో ఉండటం విద్యార్థులకు ఇబ్బంది కలగజేసిందన్నారు. వారి చదువులకు ఆటంకం కలగకుండా తక్షణమే సమస్యను పరిష్కారం చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు భానోత్ వినోద్‌కుమార్, అక్కినపల్లి వినయ్, తాళ్ల వినయ్, సుమన్, తన్వేష్, విష్ణు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న పద్మ

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని రేఖ చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్, మాజీ సర్పంచ్ మడ్డి పద్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తుంగగూడెం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దాసర వెంకటశ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ మడ్డి శ్రీదేవి, నర్సమ్మ, పేరెల్లి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో కోడూరు వాసికి మూడో ర్యాంక్



తండు వెంకటేశ్వర్లు

అర్వపల్లి : టీజీపీఎస్సీ విడుదల చేసిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో జాజిరెడ్డిగూడెం మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన నిరుపేద తండు శ్రీరాములు–సుశీల రెండో కుమారుడు తండు వెంకటేశ్వర్లు రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్ సాధించాడు. అతడు జీవశాస్త్రం లెక్చరర్‌గా ఎంపికయ్యారు. అలాగే గతంలో వెంకటేశ్వర్లు 2019 సంవత్సరంలో టీజీటీ రాష్ట్ర మొదటి ర్యాంక్, పీజీటీలో రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించారు. వెంకటేశ్వర్లు ప్రస్తుతం నాగారం మహాత్మాజ్యోతిరావుపూలే గురుకుల కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల పోత్సాహంతోనే ఈ విజయాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా విష్ణు



నియామకపత్రం అందుకుంటున్న విష్ణు

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పున్నం విష్ణు నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ చేతులమీదుగా విష్ణు నియామకపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ.. బీసీల సమస్యలపై నిరంతరం పోరాడుతానని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖమ్మంపాటి భిక్షపతిగౌడ్, గిరిగాని భిక్షపతిగౌడ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా యూత్ అధ్యక్షుడు జెల్లా కుశలవ, అజయ్‌పాటిల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.